క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గుడ్లూరు: మండలంలోని అమ్మవారిపాలెం సచివాలయం పరిధిలోని అడవిరాజుపాలెంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. ప్రజాప్రతినిధులు కూడా పాల్గొనాలని ఆయన కోరారు.

వేసవిలో ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి

గుడ్లూరు: గర్భిణులు వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యాధికారి మారుతీరావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ యోజన కార్యక్రమం కింద సోమవారం 42 మంది గర్భిణులకు వైద్యులు మారుతీరావు, సుభిహా సుల్తానాలు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉండాలంటే కాన్పులు ప్రభుత్వ వైద్యశాలల్లోనే చేయించుకోవాలన్నారు.

స్పందనకు 14 అర్జీలు

కందుకూరు అర్బన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 14 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ ఎస్ మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు.

గుండెపోటుతో ఆశా కార్యకర్త మృతి

పొన్నలూరు: పొన్నలూరు పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తగా విధులు నిర్వర్తిస్తున్న మద్దాళి లక్ష్మీనిరోష(29) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. తెల్లవారుజామున ఆమె అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు కందుకూరులోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అయితే అప్పటికే గుండెపోటుతో లక్ష్మీనిరోష మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించా రు. ఆమె మృతదేహాన్ని పీహెచ్‌సీ డాక్టర్ ఉన్నం కీర్తి, డాక్టర్ కృష్ణచైతన్య, తోటి ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

ఆర్టీసీ బస్సులు నడపాలని వినతి

టంగుటూరు: కావలి, కొత్తపట్నం, కందుకూరు, కొత్తపట్నం ఆర్టీసీ బస్సులను ఆలకూరపాడు గ్రామం మీదుగా నడపాలని టంగుటూరు, కొత్తపట్నం మండలాల ప్రజలు ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఒంగోలు, నెల్లూరు జిల్లాల ఆర్టీసీ ఆర్‌ఎంలకు సోమవారం వినతి పత్రం అందించారు. ఆలకూరపాడు మీదుగా బస్సులు నడిపితే టోల్ ఫీజు ఉండదని, దూరం కూడా తగ్గుతుందని తద్వారా ఆర్టీసీకి ఆదాయం సమకూరుతుందని వివరించారు. కొత్తపట్నం ఆలకూరపాడు గ్రామాల మధ్య నూతనంగా రోడ్డు నిర్మించినందున రెండు మండలాల ప్రజల విజ్ఞప్తి త్వరగా ఆర్టీసీ బస్సులు నడపాలని కోరారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 309లో 94 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆక్రమణకు గురైన కొంత భాగాన్ని స్వాధీనం చేసుకోవాలని సర్పంచ్ వల్లూరి రాజ్యలక్ష్మి సోమవారం తహసీల్దార్ సీహెచ్ ఉషకు వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. సోమరాజుపల్లి గ్రామ పంచాయతీకి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రావినూతల మల్లీశ్వరి, ఏడుకొండలు ప్రభుత్వ భూమిని ఆక్రమించి మామిడి మొక్కలు పెంచుతున్నారని ఆరోపించారు. వాస్తవానికి ఆ భూమిని జీవాల పెంపకందారులు వినియోగించుకుంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎంపీటీసీ ఝాన్సీ, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: రంజాన్ మాసం సందర్భంగా 8వ వార్డులో గడ్డం షరీఫ్ ఇచ్చిన ఇఫ్తార్ విందులో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్ షఫీ జాస్మిన్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఖాశింసా, ఆస్పత్రి సూపరింటెంట్ సయ్యద్ అబ్దుల్ కలాం పాల్గొన్నారు. సోమవారం రాత్రి జరిగిన ఇఫ్తార్‌లో ముస్లింలు, పట్టణ ప్రముఖులు, నాయకులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు (దువా) చేశారు.

లారీని ఢీకొన్న టెంపో

జరుగుమల్లి(సింగరాయకొండ): ముందు వెళ్తున్న లారీని వెనకాల వస్తున్న టెంపో డ్రైవర్ నిద్రమత్తు కారణంగా లారీ వెనుక భాగాన్ని ఢీకొన్న ఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. జాతీయరహదారిపై జరుగుమల్లి మండల పరిధిలో కె. బిట్రగుంట ఫ్లైఓవర్ పై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట పట్టణానికి చెందిన నిర్మల, కుటుంబసభ్యులు మరో 11 మంది తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో టెంపోలో వస్తున్నారు. టెంపో కె.బిట్రగుంట ఫ్లైఓవర్ పైకి రాగానే డ్రైవర్ చారి నిద్రమత్తు కారణంగా ముందు వెళ్తున్న లారీ వెనక భాగాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో టెంపో ముందు భాగం పూర్తిగా దెబ్బతినగా డ్రైవర్ చారి, నిర్మల, లతకు తీవ్ర గాయాలు కాగా మిగిలిన 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

ప్రతి ఇంటా జగన్ నినాదం


చాకిరాలలో ఇంటింటికీ పథకాలు వివరిస్తున్న ఎంపీపీ దంతులూరి ప్రకాశం


కనిగిరిలో పాల్గొన్న చైర్మన్ గఫార్, దేవకి వెంకటేశ్వర్లు


దాసళ్లపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, నేతలు

కనిగిరి రూరల్: మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా నేతలు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు.మండలంలోని చాకిరాలలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ అట్లా రామచంద్రారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పట్టణంలోని పలు వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. 14వ వార్డులో జరిగిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, అఖిల భారత వాసవీ సత్ర సముదాయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, కౌన్సిలర్ దేవకి సత్యవతి, వైస్ చైర్మన్ మాణిక్యరావు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. 18వ వార్డులో జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు, గృహసారథులు సిరుప గోవర్ధన్‌రెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, జానీ, పండ్ల ఖాదర్, చెంచులు, కనమర్లపూడి లక్ష్మీమోహన్ పాల్గొన్నారు. 2వ వార్డులో జేసీఎస్ కన్వీనర్, కౌన్సిలర్ వేల్పుల వెంకటేశ్వర్లు, కన్వీనర్లు షరీఫ్, షాహిద్, శ్రీను, మస్తాన్‌బీలు, 16వ వార్డులో కౌన్సిలర్ పులి విజయలక్ష్మీ, 5వ వార్డులో కన్వీనర్ బొట్టు శ్రీను, మట్టే మాలకొండయ్య, 7వ వార్డులో కౌన్సిలర్ తమ్మినేని సుజాత, శ్రీహరిరెడ్డి, దశరథరెడ్డి,మంజుల, లక్ష్మీరెడ్డిలు, 10వ వార్డులో కౌన్సిలర్ దాసరి పద్మ, కన్వీనర్లు ఎస్‌డీ రసూల్, దాసరి మురళీ, గృహసారథులు, 19వ వార్డులో కన్వీనర్ ఖాజామొహిద్దీన్, ప్యారీజాన్, ఖాజా, మన్సూర్, 4వ వార్డులో కౌన్సిలర్ నక్క రామకృష్ణ, ఎంస్ శ్రీనివాసులు, పాపసాని క్రిష్టారెడ్డి, కొలగాని సుబ్బయ్య ఇంటింటికీ తిరిగి పథకాలను వివరించారు.

వలేటివారిపాలెం: జగనన్నే మా భవిష్యత్ కార్యాక్రమంలో భాగంగా మండలంలోని 21 పంచాయతీల్లో సర్పంచ్‌లు, నాయకులు, సచివాలయ కన్వీనర్ల ఆధ్వర్యంలో ఉత్సాహంగా సాగింది. అయ్యవారిపల్లిలో సర్పంచ్ డేగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. మాజీ సర్పంచ్ పెగడ వెంకటేశ్వరావు, ఉప సర్పంచ్ మద్దులూరి కొండల్‌రావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కుమ్మర మాల్యాద్రి పాల్గొన్నారు.

లింగసముద్రం: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీనేనని పార్టీ మండల కన్వీనర్ పి.తిరుపతిరెడ్డి, జేసీఎస్ కో ఆర్డినేటర్ వి.క్రిష్టారెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వమిస్తున్న జగనన్నే మాభవిషత్తు, జగనన్నే మానమ్మకం కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు గ్రామస్థాయి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు నాయకులు పాల్గొన్నారు.

జనం గుండెల నిండా జగనన్నే

హనుమంతునిపాడు: ప్రజల గుండెల నిండా సీఎం జగనన్నే ఉన్నారని మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసలరెడ్డి అన్నారు. మా నమ్మకం నీవే జగనన్న, మా భవిష్యత్ నీవే జగనన్న గడప గడపకు కార్యక్రమం మండలంలోని దాసళ్లపల్లి, హాజీపురం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలన, వైఎస్సార్‌సీపీ అందిస్తున్న సంక్షేమ లబ్ధి మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. మండల గృ హ సారథుల కన్వీనర్ మద్ది తిరుపతయ్య, యూత్ అధ్యక్షుడు దాసరిపల్లి, గ్రామ సర్పంచ్ భవనం క్రిష్టారెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు గాండ్ల పర్తి ఆదినారాయణ, ఇతర నేతలు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పీసీపల్లి): మండలంలోని నల్లమడుగులో జగనన్నే మా భవిష్యత్..జగనన్నే మా నమ్మకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, సర్పంచ్ నూరిపోగు రాజమ్మలు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, సచివాలయాల కన్వీనర్ షేక్ హుస్సేన్, బీరం వెంకటేశ్వర్లు, మునగాల సుబ్బరాయుడు, మునగాల వెంకటసుబ్బారెడ్డి, బైరెడ్డి బ్రహ్మయ్య, బైరెడ్డి రమణారెడ్డి, బిజ్జముల తిరుపతిరెడ్డి, పతురు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పామూరు: రాష్ట్రంలోని పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మార్కొండాపురంలో సోమవారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన 46 మాసాల్లో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అదే విధంగా టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలు ఇప్పుడు అమలు చేస్తున్న పథకాలు వ్యత్యాసం, పథకాలు అందేతీరును ప్రజలకు వివరించారు. జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్ ఖాదర్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ పుట్లూరి నారాయణరెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: జగనన్నే మళ్లీ సీఎం కావాలని సచివాలయ మండల కన్వీనర్ పొల్లా సుబ్రహ్మణ్యం అన్నారు. వెలిగండ్ల గ్రామ పంచాయతీలో సోమవారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం సచివాలయ మండల కన్వీనర్ పొల్లా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని 50 ఇళ్లు తిరిగి సంక్షేమ పథకాల గురించి వివరించారు. నియోజకవర్గ సర్పంచుల సంఘ అధ్యక్షుడు టి.సురేష్‌బాబు, మండల కో ఆప్షన్ సభ్యుడు హమీద్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల రాజ్‌కుమార్,ఏ రంగయ్య, గృహసారధులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కందుకూరు అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి పట్టణంలో అద్భుతమైన స్పందన వస్తోంది. ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మున్సిపాలిటీలోని 4, 3,13,18 వార్డుల్లో జగనన్నే భవిష్యత్ కార్యక్రమాని నిర్వహించారు. కందుకూరు పట్టణ జేసీఎస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్, పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె. రఫీ, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా కిషోర్, రఫీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కుల, మత రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాల నగదును నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తుందన్నారు. నాయకులు గణేషం గంగిరెడ్డి, కృష్ణారెడ్డి, చనమాల శ్రీధర్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస దీక్షతులు, పంది కోటేశ్వరరావు, కట్టా శరత్, శీలం నరేంద్ర, రావులకొల్లు బ్రహ్మనందం, శివ, శ్రీకాంత్, మూసా, ఎస్‌కే ఖాదర్ బాషా, ఎస్‌కే హారూన్, అబ్దుల్ జబ్బర్, హుసేన్, ఎస్‌కె. జలీల్, మస్తాన్‌వలి, మహబుబ్‌బాషా, రియాజ్ పాల్గొన్నారు.


సీఎస్‌పురం: జగనన్నే మా భవిషత్ కార్యక్రమంలో నేతలు


పామూరు: లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న నేతలు


వెలిగండ్లలో పాల్గొన్న నేతలు


4వ వార్డులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు


సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న వరికూటి అశోక్‌బాబు


ఎడ్లూరుపాడులో ప్రజాభిప్రాయం తెలుసుకుంటున్న వరికూటి


బింగినపల్లిలో స్టిక్కర్లు అంటిస్తున్న వైస్ ఎంపీపీ రవికుమార్‌రెడ్డి

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. జరుగుమల్లి మండలంలోని ఎడ్లూరుపాడు గ్రామ పంచాయతీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వరికూటి పాల్గొన్నారు. వరికూటి మాట్లాడుతూ.. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే ప్రభుత్వ పథకాలు అందేవని ఆరోపించారు. ప్రభుత్వ పథకాల కోసం జన్మభూమి కమిటీల ఇళ్ల వద్ద ప్రజలు పడిగాపులు కాసిన సందర్భాలను గుర్తు చేశారు. కానీ సీఎం వైఎస్ జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నారని, అర్హత ఉండి కూడా పథకాలు అందని వారిని గుర్తించేందుకు గడప గడపకూ తాము వస్తున్నామని చెప్పారు. సాంకేతిక కారణాలతో పథకాలు అందనివారికి న్యాయం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిబద్ధతతో పనిచేస్తున్నారని కొనియాడారు. తొలుత బస్టాండు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ మాతంగి చంద్రలీల, వైస్ ఎంపీపీ చుండి శ్రీలత, సర్పంచ్ రావి శ్రీనివాసరావు, చుండి శ్రీను, చుండూరి సురేష్, మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, తహశీల్దార్ ఎస్ ఉషారాణి, ఎంపీడీఓ పి.రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌బాబు, మండల జేసీఎస్ కన్వీనర్ రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి ఎం.మాధురి, పెద్దిరెడ్డి, దద్దాల మల్లికార్జునరావు, బద్రి, దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాడవాడలా మా నమ్మకం నువ్వే జగన్

జరగుమల్లి మండలం ఎడ్లూరుపాడు ఎస్సీ కాలనీలో సోమవారం మధ్యాహ్నం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో వరికూటి అశోక్‌బాబు పాల్గొన్నారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయం తెలుసుకున్నారు. ఇంటి యాజమానుల అనుమతితో స్టిక్కర్లు అంటించారు.

➤ సింగరాయకొండ మండలం బింగినపల్లి గ్రామ పంచాయతీ ఎస్టీ కాలనీలో సోమవారం వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, ఊళ్లపాలెంలో కాళహస్తి వెంకారెడ్డి, పాతసింగరాయకొండలో సాయికోటి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు.

పొలం బడి.. కొత్త ఒరవడి


పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ స్వర్ణలత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

టంగుటూరు: తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించడం, రైతులను నిర్ణయాత్మకంగా తయారు చేయడం పొలంబడి ముఖ్య ఉద్దేశమని మండల వ్యవసాయాధికారి స్వర్ణలత పేర్కొన్నారు. సోమవారం మర్లపాడు గ్రామంలో ఏఓ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. శత్రు, మిత్ర పురుగులను గుర్తించడంపై రైతులకు అవగాహన కల్పించడంతోపాటు భూసార పరీక్షలు చేశారు. అనంతరం రైతు సాధికార సంస్థ ఏపీసీఎన్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఏఓ ఒక ఎకరం పొలం కౌలుకు తీసుకుని ప్రిమాన్ డైసోయింగ్ విధానంలో విత్తన గుళికలను వెదబెట్టారు. మొలకలు వచ్చిన 45 రోజుల తర్వాత పశువుల మేతగా, పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించుకోవచ్చని ఏఓ చెప్పారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి సేద్యం పద్ధతిలో మినుము పంట పండిస్తానని ఏఓ ప్రకటించారు. కార్యక్రమంలో వీఏఏ శ్రీనివాసరెడ్డి, ప్రకృతి వ్యవసాయాధికారులు ఎంటీ పద్మావతి, ఎల్1 వెంకట్రావు, ఎల్2 విజయలక్ష్మి, ఐసీఆర్పీలు శృతి, శ్రీనుబాబు, సుజాత, మరియమ్మ, ఐబీ ఐసీఆర్పీలు జ్యోత్స్న, సుధారాణి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి మహిళకు తీవ్ర గాయాలు

గుడ్లూరు: బైక్ అదుపు తప్పడంతో మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గుడ్లూరు–అమ్మవారిపాలెం రహదారిలో అడవిరాజుపాలెం వద్ద సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..అడవిరాజుపాలెం గ్రామానికి చెందిన కీర్తి బంగారమ్మ పొలం వెళ్లడానికి అన్నం బాక్సు తీసుకొని రోడ్డు మీదకు వచ్చి అమ్మవారిపాలెం గ్రామం వెళుతున్న యువకుడు బైక్‌పై కూర్చుంది. బైక్ గ్రామం చివర ఉన్న ఎస్సీ కాలనీ వద్దకు వెళ్లగానే అదుపు తప్పి పక్కన వాగులో పడటంతో బంగారమ్మకు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలం వద్దకు చేరుకొని క్షతగాత్రురాలును 108లో కావలికి తరలించారు.

దేవకి వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం


దేవకి వెంకటేశ్వర్లు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు, నాయకులు

కనిగిరి రూరల్: జాతీయ వాసవీ సత్ర సముదాయ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా రెండో సారి ఎన్నికైన సందర్భంగా వివిధ అసోసియేషన్లు, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో దేవకి వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. స్థానిక తాళ్లూరి కళ్యాణ మండపంలో దేవకి అభినందన పురస్కార సభ ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ దేవకి వెంకటేశ్వర్లు సేవా నిరతిని కొనియాడారు. వాసవీసత్ర సముదాయల అభివృద్ధికి దేవకి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దేవకి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్విరాల్ మెంటల్ కార్పొరేషన్ అధ్యక్షుడు గుబ్బ చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మీ పద్మావతి, వాసవీ సత్ర సముదాయల గౌరవాధ్యక్షుడు శిద్దా నాగేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు సూర్యప్రకాష్‌రావు, సూర్యకుమారి, సురేష్, టి. గోవిందరావు, అద్దంకి బాల రంగయ్య, రాచపుడి వెంకటేశ్వర్లు, ఐతా సుబ్బయ్య, వేమా సత్యన్నారాయణ, నార్లపాటి మల్లికార్జున, బి శ్రీనివాసులు, తడికమళ్ల వెంకటేశ్వర్లు, బచ్చు రమేష్, కృష్ణారావు, దేవకి రాజీవ్, సత్యావతి, కొలిపర్తి వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్వేను అడ్డుకున్న మహిళలు

లింగసముద్రం: హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న గ్రంథాలయం సర్వేకు వచ్చిన రెవెన్యూ అధికారులను మహిళలు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే..గ్రంథాలయం ఆక్రమణకు గురైందని గ్రామస్తులు కొందరు హైకోర్టుకు వెళ్లగా గ్రంథాలయం స్థలానికి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసి ఆక్రమణకు గురి కాకుండా కంచెను ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించినట్లు తహసీల్దార్ చెప్పారు. అయితే పది రోజుల క్రితం గ్రంథాలయానికి రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించగా ఆ సర్వే పక్కనే ఉన్న ఆర్యవైశ్య కళ్యాణ మండపంలోకి వెళ్లింది. దీంతో ఆర్యవైశ్యులు సర్వే కొలతకు అడ్డు తగిలి ఆపివేశారు. సోమవారం ఎంపీడీఓ శేషుబాబు, తహసీల్దార్ సుధాకరరావు రెవెన్యూ సిబ్బంది గ్రంథాలయం కొలతలు నిర్వహించేందుకు వెళ్లగా కళ్యాణ మండపం వద్దకు ఆర్యవైశ్య మహిళలు చేరుకొని కొలతలను ఆపివేశారు. దీంతో రెవెన్యూ అధికారులు వెనుదిరిగారు. రెండు రోజుల్లో పోలీసుల సమక్షంలో సర్వే చేసి నివేదిక అందజేస్తామన్నారు.


గ్రంథాలయం కొలతలు అడ్డుకుంటున్న మహిళలు

కొండపిలో 809 పొగాకు బేళ్ల కొనుగోలు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి ఎస్ఎస్ కండ్రిక, పెట్లూరు, వర్ధినేనిపాలెం. జగ్గరాజుపాలెం గ్రామాల రైతులు సోమవారం 870 బేళ్లు తీసుకురాగా 809 కొనుగోలయ్యాయి. పొగాకు అత్యధిక ధర కేజీ రూ.200, అత్యల్ప ధర రూ.167, సరాసరి ధర రూ.195.07 పలికిందని వేలం నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.

టంగుటూరులో 987 బేళ్లు కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారి పాలెం గ్రామాల రైతులు 1047 బేళ్లు తీసుకురాగా 987 కొనుగోలయ్యాయి. 60 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.200, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.191.23 పలికిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

బందోబస్తును పరిశీలించిన ఏఎస్పీ

హనుమంతునిపాడు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలు జరగుతున్న కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏఎస్పీ అశోక్ బాబు సోమవారం పరిశీలించారు. కేంద్రాల పరిసరాల్లో ఎక్కడా ఎవ్వరూ తిరగకుండా చూడాలని ఎస్సై కృష్ణ పావనికి సూచించారు. కొండపి, మర్రిపూడి, కనిగిరి , హనుమంతునిపాడు మండలాల్లోని పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలించామని పేర్కొన్నారు.